# పరిణయం

కున్నాయి. ఇద్దరూ ఐ లవ్ యూ అనుకున్నారు. కొన్నాళ్ళయింది. హీరోయిన్ ప్రెగ్నెంట్ అని భటులకి తెలిసిపోయింది. రాజు గార్కినివేదించారు. "ఇన్నాళ్ళు ఒకడు మన ఫోర్ట్‌లోకి వస్తే మీకు తెలియకుండా ఎలా ఉంటుంది. నా కెందుకు చెప్పలే" దంటూ రివాల్వర్ తీసి షూట్ చేసి పారేసాడు. వాళ్ళని రివాల్వర్ పట్టుకుని కూతురుగదిలో కొచ్చాడు. ఉష భయం భయంగా చూస్తూ నిల్చుంది. హీరో వైపు గురిపెట్టి "ఎవడ్రానీవు ఎందుకొచ్చావు?" అన్నాడు మెషన్‌గన్ తీసి "మామా దించెయ్ రివాల్వర్ ముందు" అన్నాడు అనిరుధ్. "ఉహో అల్లుడన్న మాట" అనుకొని రివాల్వర్‌తో ఏం చెయ్యలేం అనుకొని వెనుదిరిగాడు. 100 మంది సైనికు ప్రయోగించాడు. హీరో లేసర్ గన్స్, మెషిన్‌గన్ ఉపయోగించాడు. అందరూ వచ్చారు. గుళ్ళయిపోయిన సందర్భంలో వల వేసి బంధించాడు కింగ్ బాణుడు.

* * *

హీరో కనుపించక అక్కడ వారంతా గగ్గోలెత్తిపోయారు. కొందరు "విదేశీ శక్తుల ప్రభావం" అన్నారు. కొందరు "టెర్రరిస్ట్‌లు చేసుంటా"రన్నారు. వెంటనే ద్వారక పోలీస్ సూపరింటెండెంట్‌కి ఫోన్ చేసారు. ఆయన కంప్యూటర్ ఉపయోగించి ఎక్కడున్నదీ చెప్పాడు. వెంటనే కృష్ణుడు లేజర్‌గన్స్, మెషిన్‌గన్స్, టాంకులు, బాంబులు, పట్టుకొని కాకి పాంట్ షర్ట్ వేసుకొని జీప్ మీద బయల్దేరాడు. బాణుడు శివుణ్ని ప్రసన్నం చేసుకొని యుద్ధానికి సాయంరమ్మన్నాడు. కృష్ణుడు క్లోరోఫామ్ రుమాలును శివుని మీదకు విసిరేసాడు. శివుడు మూర్ఛపోయాడు. ఈలోపల బాణుణ్ని నాలుగు ఉతికి, ఉషకి అనిరుద్ధుడికి మారేజ్ చేసి, గబగబా పార్టీ ఎరేంజ్ చేసి అందర్నీ బోయింగ్ విమానాలు పంపి సాయంత్రానికి తీసుకు వచ్చాడు. శివుడు, బాణుడు అక్షింతలు వేసారు. ఈలోగా బాణుడి మాడిపోయిన ముఖం చూసి అనిరుద్ధుడు ఉష వేపు చూసి కన్నుకొట్టాడు.



ఉష తలదించుకుంది మురుసుమ్ములుగా నవ్వుతూ.

(ఈ రచన కేవలం హాస్యం కోసమే రాసింది. ఎవరినీ కించపరచడానికి కాదని మనవి)

# మినీ కథ

## ఇదీ భారతదేశం



సెయింట్ పీటర్స్ స్కూల్ తెల్లసిబోర్డుపై నీలం అక్షరాలతో రాసివుంది.

ఇండియాలో పేరుపొందిన స్కూల్స్‌లో అది ఒకటి. విశాలమైన స్కూల్ ఆవరణలో ఆగించి కారు, కారులోంచి దిగింది చూడామణి.

వెనకాల డోర్ తీసికొని దిగింద మేరీలూ.

అమెరికాలో ఉత్తమ ఉపాధ్యాయిని అవార్డు పొందింది ఆమె. సెయింట్‌పీటర్ స్కూల్ ఆహ్వానంపై ఇండియా వచ్చింది. ముఖ్యంగా సెయింట్ పీటర్‌లోని బోధనా విధానాన్ని సమీక్షించడానికి.

ఇద్దరూ మాటాడుకుంటూ ఎదురుగా క్లాస్‌రూములోకి నడిచారు.

"ఇది సిక్తుక్లాస్" చెప్పింది చూడామణి. పిల్లలందరు లేచి నిలబడి విష్ చేసారు ఇద్దరినీ. చిన్నగా గొంతు సవరించుకొని చూడామణివైపు తిరిగింది మేరీలూ.

"మీ బోధనాపద్ధతికి మాకు చాలా తేడావుంది. మా దేశంలో మేధావులందరు కలసి బోధనా విధానం ఏవిధంగా వుంటే పిల్లలు ఉత్తేజితులవుతారో కనిపెట్టారు. అందులో ఒక పద్ధతి ఇప్పుడు చెపుతాను" అంది పిల్లలవైపు తిరుగుతూ.

"మైడియర్స్" పిల్లలందరూ వింతగా భయంగా ఆమెవైపు చూసారు.

"ఇప్పుడు నేను ఒక చిన్న వాక్యం బోర్డుమీద వ్రాస్తాను, తరువాత వరుసగా కొన్ని దేశాల పేర్లు చెపుతాను. మీరు బోర్డు మీదున్న వాక్యం నేను చెప్పిన దేశాలకు అన్వయించాలి" అంటూ ఆగింది.

అందరూ బుర్రలూపారు ఉత్సాహంగా.

"మంచి సమాధానం చెప్పినవారికి చైనీస్ పెన్ బహుమానం" అంది మేరీలూ. పిల్లల ఉత్సాహం చూసి.

తరువాత వాక్యాన్ని బోర్డుమీద వ్రాసింది.

"ఒకటి, రెండు, మూడు..., ఆరు, ఏడు... పది... ఏదీ ఎక్కడ" అని ఆపింది.

"పిల్లలూ ఇప్పుడు దేశాలపేర్లు చెపుతాను దానికి పైవాక్యం అన్వయించండి" అంది మేరీలూ.

మొదటిగా ముందు వరసలో కూర్చున్న తెల్లగౌను పిల్లని అడిగింది "అమెరికా" అని.

తెల్లగౌను పిల్ల రెండునిమిషాలు ఆలోచించి...

"అమెరికాలో ప్రజలందరికీ కుక్కలంటే ఇష్టం, ఒక మిలియనీర్ తన కుక్కలను లెక్కపెట్టుకుంటున్నాడు ఒకటి... ఏడు... పది ఏదీ నా పదో కుక్క ఎక్కడాని..."

"ఫరవాలేదు గట్టివాళ్ళే" అంటూ చూడామణివైపు చూసి నవ్వింది మేరీలూ. తరువాత నల్లచొక్కా అబ్బాయిని అడిగింది "కువైట్" అని. నల్లచొక్కా అబ్బాయి లేచి చెప్పాడు బుర్రగోక్కుంటూ. "కువైట్‌లో అందరూ కోటీశ్వరులే, వాళ్ళందరూ బహుభార్యత్వం కలవారు, ఒక షేక్ తన భార్యలను లెక్కబెట్టుకుంటున్నాడు. ఒకటి... పది ఏదీ నా పదో భార్య ఏదని."

అలా అందరినీ అడిగింది. చివరిగా లాస్టుబెంచీలో కూర్చున్న ఖద్దరుచొక్కా అబ్బాయిని అడిగింది "ఇండియా" అని.

ఖద్దరుచొక్కా అబ్బాయి లేచి నిలబడి తడుముకోకుండా "ఇండియాలో దేనినైనా ఒదులుకుంటారుకాని పదవినిమాత్రం ఒదులుకోరు, మర్నాడు అసెంబ్లీలో మెజార్టీ నిరూపించుకోవలసివున్న ఒక ముఖ్యమంత్రి తన మద్దతుదార్లను లెక్కపెడుతున్నాడు ఒకటి... ఏడు... పది... ఏడీ నా పదో వాడెక్కడ" అంటూ ఆపాడు.

అర్థం కానట్టు చూసింది మేరీలూ చూడామణివైపు, చిరునవ్వు నవ్వుతూ లేచి నిలబడింది చూడామణి. ప్రకటించిన బహుమతి ఖద్దరుచొక్కా కుర్రవాడికందిస్తూ వెర్రిగా మొహంపెట్టి చూడామణిని అనుసరించింది మేరీలూ.



– వీటూరి నాగేష్
(విశాఖపట్నం)